క్లుప్తంగా

ఆశాజనకంగా చోడి సాగు



దొరజమ్ములో చోడిసాగు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఈ ఏడాది చోడి(రాగి) పంటసాగు ఆశాజనకంగా ఉందని రైతులు అంటున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆరుతడి పంట కావడంతో ప్రస్తుతం చిరుపొట్ట దశలో కళకళలాడుతోంది. మరికొన్ని రోజుల్లో కోతకు రానుంది. మండలంలో ఈ ఏడాది 320.4 హెక్టార్లలో చోడిసాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడండి

వీరఘట్టం: మండలంలో అన్ని పంచాయతీల్లో నిర్మాణాల్లో ఉన్న సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలను త్వరగా పూర్తిచేయించాలని ఎంపీడీఓ వై.వెంకటరమణ సూచించారు. శనివారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా ఆయా భవనాల నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని ఆరాతీశారు. నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు పెట్టాలన్నారు.

చిత్రలేఖనంలో శిక్షణ



చిత్రలేఖనంపై శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయుడు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి నేతృత్వంలో చిత్రలేఖనంపై తర్ఫీదు అందించారు. దసరా సెలవుల్లో సమయం వృథా చేయకుండా విద్యార్థులు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను, గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు కోరారు. వివిధ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాచిపెంట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఐవో(జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్) టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని మంచాడవలస, గంగన్నదొరవలస, కర్రివలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ప్రధానంగా అక్కడ గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల రికార్డులను తనిఖీ చేశారు. టీకా గడువు తేదీలు పక్కాగా నమోదు చేసి, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. చిన్నారులు, గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు పక్కాగా చేసి, బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించాలని, వారు పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. హై రిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని తరచూ పర్యవేక్షించాలన్నారు. ప్రసవ సమయం దగ్గర పడుతున్న సమయంలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతిరోజూ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శోభారాణి, సూపర్‌వైజర్ జయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

23న పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం

సీతానగరం: పార్వతీపురంలో ఈ నెల 23వ తేదీన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరగనుందని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ సభ్యుడు టి.వెంకటఅప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై మండలంలోని కాశీపేటలో సర్పంచ్ ధనంజయమ్మ అధ్యక్షతన గ్రామ వలంటీర్లు, గృహసారథులతో సమావేశమైన ఆయన పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు జరిగే ఈ సమావేశానికి బలిజిపేట, పార్వతీపురం, సీతానగరం మండలాలకు చెందిన పార్టీ శ్రేణులంతా తరలిరావాలన్నారు.

వినతిపత్రం అందజేత

సాలూరు: స్థానిక పట్టణంలో అదనపు కోర్టు, సబ్‌కోర్టుల మంజూరుకు చొరవ తీసుకోవాలని కోరుతూ బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు శనివారం వినతిపత్రం అందజేశారు. గత ఆరు దశాబ్దాలుగా ఒకేఒక్క జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మాత్రమే ఉన్నాయని, దీంతో చాలా కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 2,872 కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, అదనపు, సబ్‌కోర్టులు వస్తే కేసుల పరిష్కారం త్వరితగతం చేయవచ్చన్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షుడు తాడ్డి తిరుపతిరావు, జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీ నమోస్తుతే..



పాలకొండ: ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమ పూజలు



పాలకొండ: దుర్గాదేవి అవతారంలో కోటదుర్గమ్మ



పాలకొండ రూరల్: నక్కపేట జ్ఞానసరస్వతీ ఆలయంలో..



కురుపాం: మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన కురుపాం కోటదుర్గమ్మ



భామిని: బత్తిలిలో శాకాంబరి అలంకరణలో లలితా త్రిపురసుందరి అమ్మవారు

దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దుర్గాదేవి అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులచే పూజలందుకుంటున్నారు. అర్చకులు శనివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. పాలకొండ కోటదుర్గమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భామిని మండలం బత్తిలిలో లలితా త్రిపురసుందరి అమ్మవారు శాకాంబరి అలంకరణలో పూజలందుకున్నారు. కురుపాం మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలసిన కోటదుర్గమ్మ మహాలక్ష్మి అలంకరణలో కనిపించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం

- రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరూ జగనన్న కుటుంబ సభ్యులే..
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



పాలకొండ రూరల్: తంపటాపల్లి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

పాలకొండ రూరల్: ప్రజారోగ్య భద్రతకు సీఎం జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ, ఏపీ శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని తంపటాపల్లి సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లు సురేష్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు అల్లు శ్రీనివాస్, దిలీప్, సాయిరాం కుమార్, అల్లు ఈశ్వరరావు, బొమ్మాళి పార్వతి తదితరులున్నారు.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

భామిని: మండలంలోని లివిరి సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్‌లు బౌరి సోదామిని, వలరౌతు రజిని, ఎంపీటీసీ పొట్నూరు ఉషా ప్రారంభించారు. ఈ శిబిరంలో 479 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్ శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వారి వెంట స్థానిక నాయకులు గెల్లంకి రమేష్, కాగితాపల్లి కృష్ణారావు, బౌరి త్రినాథరావు తదితరులున్నారు.

గడపగడపకు సర్కారు వైద్యం

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లోని గడపగడపకు ప్రభుత్వ వైద్య సేవలు చేరువయ్యాయని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. పనసనందివాడలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పొల్లలో..

సీతంపేట: మండలంలోని పొల్ల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కె.గీతాంజలి వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది శిబిరంలో సేవలందించారు.



సీతంపేట: కేస్ షీట్ అందజేస్తున్న ఎంపీడీఓ గీతాంజలి



భామిని: పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



కొమరాడ: గంగారేగువలసలో వైద్య శిబిరం వద్ద మాట్లాడుతున్న జనార్దనరావు

గంగారేగువలసలో..

కొమరాడ: విద్య, వైద్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు అన్నారు. మండలంలోని గంగారేగువలసలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మల్లికార్జునరావు, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, సర్పంచ్ కోడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కిడిలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు బృందం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులకు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ రాజారావు వైద్య సేవలను పర్యవేక్షించారు.



వీరఘట్టం: పనసనందివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్యులు, అధికారులు



గుమ్మలక్ష్మీపురం: కుక్కిడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, అధికారులు

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న డీడీ మంగవేణి

సీతంపేట: భాషా వలంటీర్లు విద్యార్థులకు చక్కగా బోధించాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సవర భాషా వలంటీర్లకు ఐదు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీడీ మంగవేణి మాట్లాడుతూ భాషా వలంటీర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. టీఎల్ఎం సాయంతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సీఎంఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రెండు పోలింగ్ బూత్‌ల మార్పు



కీసర ఎంపీయూపీ స్కూల్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటుకు వసతులు పరిశీలిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని రెండు పోలింగ్ బూత్‌ల మార్పునకు ప్రతిపాదించినట్లు తహసీల్దార్ నీలాపు అప్పారావు శనివారం తెలిపారు. కోసలిలోని మూడు బూత్‌లలో ఒకటి కీసర ఎంపీయూపీ స్కూల్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భామిని మండల కేంద్రంలోని మూడు బూత్‌లలో ఒక దాన్ని బొడ్డగూడ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహణకు గుర్తించామన్నారు. డీటీ నిమ్మల శేఖరం, సర్వేయర్లు రాజేశ్వరరావు, తోట రామ్మోహనరావు, ఆర్ఐ ఎస్.రాంబాబుతో కలిసి కొత్త పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ పరిశీలించారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయనిధి



సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి సహాయనిధి అర్హులకు అండగా నిలుస్తోందని మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం మండలం రేగులపాడు గ్రామంలో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బొడ్రోతు వెంటకరమణకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షలు చెక్‌ను పాలకొండలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో శనివారం బాధితుని తండ్రి నారాయణరావుకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మెరుగుల చంద్రమౌళీశ్వరరావు, మెరుగుల రాజు, కన్నబాబు, గోవిందరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

పంట ఎండిపోతున్నా పట్టించుకోరా?



రాజ్యలక్ష్మీపురం వద్ద పొట్టదశలో ఎండిపోతున్న పంటలు

కొమరాడ: మండలంలోని జంఝావతి రబ్బర్ డ్యామ్ నుంచి లోలెవల్ కెనాల్ వద్ద అమర్చిన ఎత్తిపోతల పథకాన్ని అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తురని ఈ ప్రాంత రైతులు మండిపడుతున్నారు. ఈ పథకం ద్వారా ఏటా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందేదని, కానీ ఈ ఏడాది అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకం నిర్వహణ పడకేసిందని ఆరోపిస్తున్నారు. పథకం నుంచి నీరు విడుదల చేయకపోవడం, వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని సాంకేతిక సమస్యను పరిష్కరించి సాగునీరు విడుదలకు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.

వరి పంట పరిశీలన



చింతలబెలగాంలో వరిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి, చింతలబెలగాంలో వరి నూతన వంగడాల సాగును కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. కేవీకే రస్తాకుంటుబాయి ద్వారా అందించిన ఎంటీయూ 1224 రకం వరి పంటను, చిరుసంచుల ప్రదర్శనను పరిశీలించారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో సాగుచేస్తున్న ఈ రకం పంటను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ రకం పంట దోమపోటును సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. రైతులు దీన్ని సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని కోరారు. పెదమేరంగిలో చిరుసంచులైన బీపీటీ 3082 ప్రదర్శనను తిలకించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, అనంతవిహారి, అమృతవీణ, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభ

మక్కువ: పనసభద్ర గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంచాయతీలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. గ్రామాభివృద్ధి, రైతులకు ఉపయోగపడేలా పనులు ఉండేలా చూడాలని ఏపీవో ఈశ్వరమ్మను గ్రామస్తులు కోరారు.

పోలీస్ అమర వీరులకు నివాళి



పాలకొండ రూరల్: అమరవీరుల సంస్మరణ ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ జీవీ కృష్ణారావు, పోలీస్ సిబ్బంది

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలు శ్లాఘనీయమని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తుచేసుకుని, వారికి నివాళులర్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి విశాఖ రహదారిలో ఉన్న వైఎస్సార్ కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీఐ కె.మురళీధర్, ఎస్సై బి.శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. వీరఘట్టం కూడలి వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన మానవహారంలో ప్రజలు స్వచ్ఛందగా పాల్గొన్నారు.

భామిని: దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమర వీరులకు బత్తిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ చేపట్టారు. ఏఎస్సై, పీసీలు పాల్గొన్నారు.



భామిని: బత్తిలిలో సంస్మరణ ర్యాలీ చేస్తున్న పోలీసులు

భూముల రీసర్వేకు సహకరించాలి



సీతానగరం: భూముల రీసర్వేపై సమీక్షిస్తున్న డిప్యూటీ ల్యాండ్ రికార్డ్స్ సర్వే అధికారి సూర్యారావు

సీతానగరం: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని, సర్వే సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండి భూముల వివరాలు తెలియజేయాలని తహసీల్దారు ఎన్వీ రమణ కోరారు. శనివారం మండలంలోని దయానిధిపురం గ్రామ రామమందిరం వద్ద సర్పంచ్ రామారావు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో రైతులతో సమావేశమైన ఆయన త్వరలో గ్రామంలో సర్వే ప్రారంభించనున్నామని, రైతులంతా అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కొన్ని వందల సంవత్సరాల నుంచి పరిష్కారం కాని భూ సమస్యలు, భూ వివాదాలు కూడా పరిష్కారమవుతున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ చక్కని అవకాశాన్ని ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు దశల్లో మండలంలోని 30 గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తయిందని, మూడో విడతలో దయానిధిపురం, రెడ్డివారానివలసరామవరం, ఆర్.వెంకంపేట, పెదబోగిలి, బూర్జ గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, సర్వేయరు గౌరీశంకరరావు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: అర్హులకే భూములు చెందేలా, హక్కుదారులకు తమ భూములపై సర్వహక్కులు కలిగించేందుకే ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ల్యాండ్ రికార్డ్స్ సర్వే అధికారి సూర్యారావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎన్వీ రమణ అధ్యక్షతన సచివాలయ సర్వేయర్లతో భూముల రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్‌పై సమీక్షించిన ఆయన సర్వే పక్కాగా చేపట్టాలని, ఏ రైతుకూ అన్యాయం జరగకుండా సక్రమంగా సర్వే చేయాలన్నారు. కొన్ని వందల ఏళ్లుగా నలుగుతున్న భూ తగాదాలు, సమస్యలు ఈ సర్వేతో పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, మండల సర్వేయరు గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'ముద్దాడ'కు ఘననివాళి

సాలూరు: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ముద్దాడ గాంధీ విగ్రహానికి సాలూరు రూరల్ సీఐలు శ్రీనివాసరావు, ధనుంజయనాయుడు, సాలూరు, పాచిపెంట ఎస్ఐలు ప్రయోగమూర్తి, ఫక్రుద్దీన్ తదితరులు పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. పోలీస్‌గా ఆయన విధి నిర్వహణలో చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, ఉత్తమ పోలీసులుగా వెలుగొందాలని కోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆయన అమరుడు అని కొనియాడారు. కార్యక్రమంలో గాంధీ కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.